
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
శుక్రవారం 9 ఆగస్టు 2024

పల్లెలు పచ్చదనంతో కళకళలాడేలా చర్యలు 8లో..

8లో.. ఎస్సీ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలి

ఆహార నాణ్యతపై నిఘా ఏదీ?


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

“ ఆహార నాణ్యతపై నిఘా కొరవడింది. నియంత్రణ లేక రేషన్ దుకాణాల సరుకులు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పర్యవేక్షించే వారే కరువయ్యారు. మరోవైపు జిల్లాలో హోటళ్లు, రెస్టారెంట్‌లు, కిరాణా, సూపర్‌మార్కెట్‌లలో నాసిరకం విక్రయాలు, సరుకుల తూకాల్లో మోసాలు, బ్రాండెడ్ కంపెనీల లేబుళ్లతో సరుకుల అమ్మకాలు జరుగుతుండడంతో వినియోగదారులు మోసపోతున్నారు. అధికార యంత్రాంగం తనిఖీలు మర్చిపోగా, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఆహార సలహా సంఘాలకు మంగళం పాడారు.

- ఐదేళ్లుగా ఆహార సలహా సంఘాలు దూరం
- జిల్లాలో 4.97 లక్షల మంది రేషన్ లబ్ధిదారులు
- 587 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్య లక్ష్మి ద్వారా పౌష్టికాహారం
- పాఠశాలల్లో 40 వేల మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం
- మార్కెట్లో నాసిరకం సరుకులతో పెరుగుతున్న మోసాలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కంటే ముందు పకడ్బందీగా ఆహార సలహా సంఘాలు నిరంతరాయంగా పనిచేశాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఆహార సంఘాల పదవీకాలం ముగిసిన తరువాత మళ్లీ వాటిని పట్టించు కోకపోవడంతో వాటి ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. కమిటీల నియామకాలు లేకుండానే ఐదేళ్లు గడిచిపోయింది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం సలహా సంఘాలపై దృష్టి పెడుతుందని భావించినా ఎనిమిది నెలలు గడిచిపోయినా వాటి ఊసే లేకపోవడంతో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఆహార పంపిణీ, కేంద్రాలపై కూడా నిఘా లేకుండా పోయిందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

● ప్రశ్నార్థకంగా నాణ్యత ప్రమాణాలు...

జిల్లాలో పేదలకు అందించే రేషన్ బియ్యం, అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, నాణ్యత ప్రమాణాలు లేకుండా పోయాయనే విమర్శలు వస్తున్నాయి. ఎక్కడైనా నాణ్యత లోపాలు ఉంటే వాటిని ప్రభుత్వం దృష్టికి ఆహార సలహా సంఘం కమిటీ సభ్యులు తీసుకెళ్లేవారు. జిల్లాలో 345 రేషన్ దుకాణాలు ఉండగా 1,73,745 రేషన్ కార్డులు ఉండగా 4,97,103 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా 32,43,212 కిలోల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. రేషన్ లబ్ధిదారుల్లో బోయినపల్లిలో 32,761 మంది లబ్ధిదారులు ఉండగా చందుర్తిలో 29,557 మంది, గంభీరావుపేటలో 40,859, ఇల్లంతకుంటలో 42,573, కోనరావుపేట 40,244, ముస్తాబాద్ 41,892, రుద్రంగి 14,603, సిరిసిల్ల 79,491, తంగళ్లపల్లి 40,283, వీర్నపల్లి 12,822, వేములవాడ 56,964, వేములవాడ రూరల్ 20,744, ఎల్లారెడ్డిపేట 44,283 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతినెలా బియ్యం సరఫరా చేస్తున్నారు.

సన్నబియ్యం సరఫరా నేపథ్యంలో పలు అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో 510 పాఠశాలలు, 40 వేలకు పైగా పిల్లలకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. వీటితో పాటు రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్లలో అల్పాహారం అందిస్తున్నారు. వీటిపై కూడా నియంత్రణ అంతంత మాత్రంగానే కొనసాగుతోంది. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రితో పాటు వేములవాడ ఏరియా ఆసుపత్రి రోగులకు పౌష్టికాహారం ఇస్తున్నారు. అసుపత్రుల్లో కూడా మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందడం లేదనే విమర్శలు ఉన్నాయి. జిల్లాలో 587 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, బాలింతలు, గర్భిణులకు సంబంధించి 40 వేలకు పైగా లబ్ధిదారులు ఉన్నారు. ఆరోగ్యలక్ష్మి ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాలలోపు పిల్లల్లో 17,138 మంది పిల్లలకు బాలామృతం, 16 కోడిగుడ్లు టేక్ హోం రేషన్‌గా అందిస్తున్నారు. 15,195 మంది మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు ఒకపూట సంపూర్ణభోజనం, గుడ్లు, పాలు అందిస్తున్నారు. వీరితో పాటు గర్భిణులు, బాలింతలకు కూడా గుడ్లు, పాలు పప్పు, కూరగాయలతో భోజనం కోడిగుడ్లు అందిస్తున్నారు. దీంతో పాటు సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలతో పాటు మండల కేంద్రాల్లో నిత్యావసర సరుకుల్లో కూడా అనేక మోసాలు జరుగుతున్నాయి. బ్రాండెండ్ పేరుతో నకిలీ సరుకుల, వంట నూనె, తదితర మోసాలు జరుగుతున్నా పట్టించుకునే వారే లేరు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఆహార సలహా సంఘాలను నియమించి నియంత్రణ పెంచుతుందని భావిస్తున్నారు.

● జిల్లా స్థాయి నుంచి మండలాల వరకు...



గతంలో ఆహార సలహా సంఘాలు జిల్లా కమిటీ నుంచి మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి నిరంతరం నాణ్యమైన ఆహారం సరుకులపై నిఘా పెట్టేవారు. ఇప్పుడు కనీసం పట్టించుకునే వారే కరువయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో రెండు రెవెన్యూ డివిజన్లు, 12 మండలాలు, సిరిస్లిల, వేములవాడ రెండు మున్సిపాలిటీల్లో ఆహార సలహా సంఘం కమిటీలు పనిచేసేవి. గతంలో మండలం డివిజన్, జిల్లా స్థాయిలో ఈ కమిటీలు పనిచేసేవి. జిల్లా స్థాయిలో కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్డీవో, మండల స్థాయిలో తహసీల్దార్లు చైర్మన్లుగా ఉండేవారు. మండల స్థాయిలో ఎంపీపీ వైస్ చైర్మన్‌గా, జడ్పీటీసీ సభ్యుడుతో పాటు ముగ్గురు మహిళ ప్రతినిధులు, వ్యవసాయ అధికారి, ఇద్దరు చొప్పున జర్నలిస్టులు, ఉపాధ్యాయులు, రైతులు, ఎంపీడీవో, డీలర్లు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి, రాజకీయ పార్టీల నుంచి ఒక్కొక్కరు సభ్యులుగా ఉండేవారు. మూడు నెలలకు ఒకసారి మండల స్థాయిలో, ఆరు నెలలకు ఒకసారి డివిజన్ స్థాయిలో సమావేశాలు నిర్వహించే వారు. నాలుగేళ్లగా ఈ సంఘాలను పట్టించుకునే వారు కరువయ్యారు. ఆహార సలహా సంఘాలు ఏర్పాటు చేయకపోవడంపై నిరసనలు వ్యక్తం అవుతున్నాయి.

భరోసా కేంద్రం ద్వారా సత్వర సేవలు అందించాలి

- ఎస్పీ అఖిల్‌మహాజన్


వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ

సిరిసిల్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బాధిత మహిళలు, చిన్నపిల్లలకు భరోసా కేంద్రం ద్వారా సత్వర సేవలు అందించాలని భరోసా కేంద్రం అందిస్తున్న సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. గురువారం సిరిసిల్లలోని భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. న్యాయ సలహాలు, కౌన్సెలింగ్, వైద్య పరంగా తీసుకుంటున్న చర్యలు, మహిళల వేధింపులపై నమోదవుతున్న కేసుల వివరాలు తెలుసుకున్నారు. లైంగిక దాడులకు గురైన బాధితులకు సత్వరమే సేవలు అందించాల్సిన బాధ్యత భరోసా కేంద్రంపై ఉంటుందని ఎస్పీ అన్నారు. జిల్లాలో ఎక్కడైనా పోక్సో అత్యాచార కేసులు జరుగగానే సంబంధిత బాధితులను భరోసా కేంద్రానికి సంబంధిత అధికారులు తీసుకోని రాగానే చట్టప్రకారం వారికి అందించాల్సిన సూచనలు, సలహాలు ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. అత్యాచారం, పోక్సో కేసుల్లో బాధితులకు త్వరగా పరిహారం ఇప్పించడాఇకి అధికారులు, సిబ్బంది కృషి చేయాలని అన్నారు. అయన వెంట టౌన్ సీఐ కృష్ణ, డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ జ్యోతి, భరోసా కేంద్రం కో ఆర్డినేటర్ శిల్ప, లీగల్ సపోర్ట్ పర్సన్ అనంత, సౌభావతి, మల్లీశ్వరి, ఏఎన్‌ఎం పవనిత ఉన్నారు.

‘సహకార’ సేవలు వినియోగించుకోవాలి

- నాఫ్స్ కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు


పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్న రవీందర్‌రావు

ముస్తాబాద్, ఆగస్టు 8: రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సేవలను వినియోగించుకోవాలని నాఫ్స్ కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు అన్నారు. ముస్తాబాద్ మండలం ఆవునూరులో పోతుగల్ వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ సేవలను సింగిల్ విండో చైర్మన్ తన్నీరు బాపురావుతో కలిసి గురువారం పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని సహకార సంఘాలకు తెలంగాణ సహకార సంఘాలు దిక్సూచిగా మారాయన్నారు. సహకార సంఘంలో రైతులకు దీర్ఘకాలిక రుణాలతో పాటు అన్ని రకాల సేవలను అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అల్మాస్‌పూర్ ప్యాక్స్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఉచ్చిడి మోహన్ రెడ్డి, ముస్తాబాద్ ప్యాక్స్ చైర్మన్ రాజేందర్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ నర్సయ్య, భారత్ పెట్రోలియం ఎగ్జిక్యూటివ్ మణిదీప్ సింగ్, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, వైస్ చైర్మన్ రాజేశం గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్లు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో భవిష్యత్ నాశనం చేసుకోవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

ముస్తాబాద్, ఆగస్టు 8: యువత గంజాయి మత్తులో భవిష్యత్ నాశనం చేసుకోవద్దని రాజన్న సిరిసిల్ల జిల్లా సీనియర్ సివిల్ జడ్జి రాధిక జస్వాల్ సూచించారు. మండల కేంద్రంలోని సేవాలాల్ తండాలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీనియర్ సివిల్ జడ్జి పాల్గొని మాట్లాడారు. కోపాలతో ఆవేశాలతో ఒకరిపై ఒకరు కొట్లాట పెట్టుకొని, కేసులతో జీవితం నాశనం చేసుకోవద్దని సూచించారు. సెప్టెంబరులో జరిగే లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్థులకు సూచించారు. యువత గంజాయి మత్తులో వారి భవిష్యత్తును పాడు చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో జిల్లా లోక్ అదాలత్ చైర్మన్ చింతోజు భాస్కర్, ఎస్సై గణేష్, పీపీ శ్రీనివాస్, లీగల్ సెల్ కార్యదర్శి మల్లికార్జున్ యాదవ్, భరోసా లీగల్ ఇన్‌చార్జి అనంత, కోర్టు సిబ్బంది, గ్రామస్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎస్పీ ఆధ్వర్యంలో ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఎస్పీ నాయకులు

వేములవాడ టౌన్, ఆగస్టు 8: వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ అంబేద్కర్ విగ్రహం నుంచి కోరుట్ల బస్టాండు వరకు ఎంఎస్పీ(మహాజన సోషలిస్టు పార్టీ) ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండా థామస్ మాట్లాడుతూ అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టే వరకు ఉద్యమాన్ని చేపడుతామన్నారు. మంద కృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ కోసం 30 యేళ్లుగా పోరాటం చేస్తున్నారని అన్నారు. ఎస్సీ షెడ్యూల్ కులాల వర్గీకరణను సుప్రీం కోర్టు ద్వారా ఆగస్టు 1వ తేదీన సాధించుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో బొడ్డు రాములు, కానాపురం లక్ష్మణ్, నేదూరి నర్సయ్య, ఎలగందుల బిక్షపతి, బొల్లారం చంద్రమౌళి, సతీష్, మనోజ్, అరుణ్, ఎల్లన్న, స్వామి, శంకర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

- వ్యాపారం చేసుకునేందుకు రూ. లక్ష వరకు సహాయం
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్


దివ్యాంగులకు పరికరాలను అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి, ఆగస్టు 8: దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉపకరణాలు, సహాయ పరికరాలు ఎంపిక శిబిరానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన దివ్యాంగులకు సహాయ పరికరాల పంపిణీ చేసేందుకు మూడు రోజులుగా ఎంపిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అర్హులైన దివ్యాంగులు క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులైన వారికి బ్యాటరీ ఆపరేటడ్ ట్రై సైకిళ్లు, చేతి కర్రలు, చంక కర్రలు, వీల్ చైర్లు, మూడు చక్రాల సైకిల్లు, రోలెటర్స్, వినికిడి యంత్రాలు, దివ్యాంగులకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేస్తామన్నారు. దివ్యాంగులకు చిరు వ్యాపారాలు చేసుకునేందుకు పూర్తి సబ్సిడీతో 50 వేల రూపాయల నుంచి లక్ష రూపాయల వరకు సహాయం చేస్తామని తెలిపారు. ఎన్నికల కోడ్ వల్ల క్యాంపులు నిర్వహించడం ఆలస్యమైందన్నారు. జిల్లాలో దివ్యాంగులకు సంబంధించిన తొమ్మిదివేల పైచిలుకు పెన్షన్లు వస్తున్నాయన్నారు.

కొంత మంది దివ్యాంగులకు పెన్షన్లు రావాల్సి ఉందని త్వరలోనే ప్రతీ ఒక్కరికి పెన్షన్ వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. సిరిసిల్లలో ఈనెల 8న కంటిచూపునకు, 21న వినికిడికి, 23న ఆర్థో, 28న మానసి క వికలాంగులకు సదరం క్యాంపు నిర్వహిచబడుతుందన్నారు. జిల్లా పరిధిలో నమోదైన 16వేల పైచిలుకు మంది దివ్యాంగులకు అన్ని ఉపకరణాలు అందించేం దుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టి అర్హులైన వారిని గుర్తించాలన్నారు. గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. సాంకేతికపరంగా కొంత మందికి రుణమాఫీ కాలేదని తెలిపారు. అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ చేస్తామన్నారు. అనంతరం స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కను నాటారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, సీడీపీవో సౌందర్య, అడిషనల్ సీడీపీవో సుచరిత, తహసీల్దార్ శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రదీప్, చందుర్తి సింగిల్‌విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శంకరమ్మ, నిర్మల, మమత, మాజీ జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, సింగిల్ విండో డైరెక్టర్ చింతపంటి రామస్వామి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆదివాసీ, గిరిజన జీవన చిత్రాలు


శేఖర్ అవార్డు పొందిన ఫొటోలు

- ఫొటోగ్రఫీలో... అంతర్జాతీయ ఖ్యాతి
- ఎన్‌బీటీ ద్వారా గిరిజనుల ఫొటోలతో క్యాలెండర్
- ఖండాంతరాలు దాటిన శేఖర్ ఫొటో
- నేడు ఆదివాసీ, గిరిజన దినోత్సవం



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

అడవితో వీడని బంధం.. ప్రత్యేకమైన వస్త్రధారణ, అటవీ సంపద, పోడు వ్యవసాయం, జీవనాధారంగా మానవ జాతికి ఆనవాలుగా ఆదివాసీలు, గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. అమాయకత్వమే వారి ఆభరణం, మూగజీవాలు వారి నేస్తాలుగా ఇంకా అనేక ప్రాంతాల్లో విద్య, వైద్యం, తాగునీరు, రోడ్ల వంటి మౌలిక సదుపాయాలు లేక జీవనం సాగిస్తున్నారు. అడవుల్లో వాగులు, కొండలు, పచ్చని పకృతి ఒడిలో సంప్రాదాయాలు, ఆచార వ్యవహారాలను వీడకుండా జీవనం సాగిస్తున్నా ఆదివాసీ గిరిజనులను సిరిసిల్లకు చెందిన అంతర్జాతీయ ఫొటోగ్రాఫర్ ఎంసీ శేఖర్ బంధించారు. శుక్రవారం ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఆదివాసీల జీవన శైలిని, వారి బతుకు చిత్రాలను నిశితంగా పరిశీలిస్తూ వారి జీవనశైలిని బందిస్తూ ఫొటోగ్రఫీ రంగంలో ఖండాంతరాలు దాటిన శేఖర్ అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులను అందుకున్నారు. సిరిసిల్లలో సిగ్మా ఫొటో స్టూడియోతో ఛాయచిత్ర రంగంలో అడుగు పెట్టిన మేర్గ శేఖర్ అంతర్జాతీయ స్థాయిలో వరుసగా అనేక అవార్డులను అందుకోవడంతోపాటు అతని ఫొటోలతో పలు దేశాల్లో ప్రదర్శనలు కూడా నిర్వహించారు. సిగ్మా పేరే శేఖర్‌కు సిరిసిల్లలో ఇంటి పేరుగా మారిపోయింది. ఇప్పుడు సిగ్మా అకాడమీ స్థాపించి ఔత్సాహిక ఫొటోగ్రాపర్లకు శిక్షణ ఇచ్చి వారి ఎదుగుదలకు తోడ్పడుతున్నారు. ఫొటోగ్రఫీ రంగంలోనే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన శేఖర్ రాష్ట్ర ప్రభుత్వం నుంచి పలు అవార్డులను అందుకున్నారు. శేఖర్ గిరిజనుల సంస్కృతి, నృత్యాలతో తీసిన ఫొటోలు అంతర్జాతీయ స్థాయిలో అవార్డులను అందుకున్నారు. 2013లో నేషనల్‌బుక్ ట్రస్టు ద్వారా కేంద్ర ప్రభుత్వం క్యాలెండర్‌ను శేఖర్ తీసిన గిరిజనుల ఫొటోలతో ముద్రించారు.

రాజన్నను దర్శించుకున్న కామారెడ్డి ఎమ్మెల్యే


కోడె మొక్కును చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే


వేములవాడ కల్చరల్, ఆగస్టు 8: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన ఆయనకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వెంకరమ ణారెడ్డి కుటుంబ సభ్యులు రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు ఆశీర్వదించగా ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు ప్రసాదాన్ని అందజేశారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని పెట్టాలి

ఇల్లంతకుంట, ఆగస్టు 8: ప్రభుత్వం రూపొందించిన మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్నభోజనం పెట్టాలని ఎంపీడీవో శశికళ పేర్కొన్నారు. మండలంలోని గాలిపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన, భోజనాన్ని సరైన సమయానికి అందివ్వాలన్నారు. ఉపాధ్యాయులు ప్రతిరోజు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన తర్వాతే విద్యార్థులకు పెట్టాలని సూచించారు. అనంతరం తాళ్లపల్లి, ముస్కానిపేట గ్రామపంచాయతీ కార్యాలయాలను పరిశీలించారు.

ఆర్థిక సాయం అందజేత

ముస్తాబాద్, ఆగస్టు 8: ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన ముక్క కృష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. తనతో 2009-10 సంవత్సరంలో పదోతరగతి చదివిన తోటి స్నేహితులు ఆయన కుటుంబాన్ని పరామర్శించి రూ. 16 వేలు ఆర్థిక సహాయాన్ని తండ్రి ముక్క మల్లయ్యకు అందించారు.









'మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం చేసుకోవద్దు'

చిగురుమామిడి,అగస్టు 8: బంగారు భవిష్యత్ ఉన్న విద్యార్థులు మాదక ద్రవ్యాలు వాడి జీవితాలను నాశనం చేసుకోవద్దని తిమ్మాపూర్ సిఐ అన్నారు. గురువారం మండలంలోని చిన్నముల్కనూర్ గ్రామంలో గల మోడల్ స్కూల్‌లో సైబర్ క్రైమ్, మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్‌క్రైమ్‌కు గురైతే వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేయలన్నారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలపై అయితే 100 నెంబర్ కాల్ చేయాలన్నారు. ఉన్నతమైన చదువులు చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఎస్సై బండి రాజశే, పాఠశాల ప్రిన్సిపాల్ ఉన్నారు.







యువతి ఆత్మహత్య

తిమ్మాపూర్, ఆగస్టు8: మండలంలోని పోరండ్ల గ్రామంలో ఓ యువతి ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పోరండ్ల గ్రామానికి చెందిన మామిడి మొగిళి గ్రామంలో హోటల్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతనికి ఇద్దరు కూతుళ్ల ఉన్నారు. చిన్న కూతురు మామిడి అఖిల(20) యంఎల్‌టి చదివింది. గురువారం మధ్యాహ్నం అఖిల హోటల్ వద్దకు వచ్చి మధ్యాహ్నం 2గంటల వరకు తల్లితో మాట్లాడి ఇంటికి వెళ్లింది. తరువాత కొద్ది సేపటికి సుమారు 3.30గంటల సమయంలో తల్లి కుతురు అఖిలకు ఫోన్ చేయగా ఫోన్ ఎత్తకపోవడంతో తల్లి ఇంటికి వెళ్లింది. ఇంటికి వెళ్లి చూసే సరిగి ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని కనిపించింది. స్థానికులు వచ్చి అఖిలను కిందికి దింపి చూడగా అప్పటికే అఖిల మృతి చెందింది. అయితే తన కూతురు చనిపోయోముందు ఒక పుస్తకంలో అంగోతు భరత్, అంగోతు కోటయ్య, అంగోతు విజయలు ఫోన్‌లో వేధింపులకు గురిచేశారని, ఆర్థికంగా కూడా ఇబ్బందులకు గురి చేసినందుకుగాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు, తన చావుకు వారే కారణం అని రాసిందని తెలిపారు. తన కూతురు చావుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని తండ్రి మొగిళి పోలీసులకు ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు వారు తెలిపారు.

ఇంటింటా జ్వర సర్వే

చొప్పదండి, ఆగస్టు 8: స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా చొప్పదండిలో వైద్యశాఖ ఆధ్వర్యంలో గురువారం ఇంటింటా జ్వర సర్వే నిర్వహించారు. ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ అధికారులు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో డెంగ్యూ, మలేరియాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, మేనేజర్ ప్రశాంత్ కుమార్, కౌన్సిలర్లు సిబ్బంది పాల్గొన్నారు.









ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి/రామడుగు/బోయినపల్లి/ఇల్లంతకుంట, ఆగస్టు 8: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. గురువారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 8,816 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల నుంచి మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, తాగునీటి అవసరాల కోసం 121 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.935 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. మిడ్ మానేరు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 17.15 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6,400 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఇల్లంతకుంట మండలంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.24టీఎంసీల నీరు ఉంది. మిడ్ మానేరు ద్వారా 6,400 క్యూసెక్కుల నీటిని రెండు మోటార్ల ద్వారా ఎత్తిపోస్తుండగా రంగనాయకసాగర్‌కు 6,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

● ఎస్సారెస్పీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

జగిత్యాల: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు అధికారులు మూడు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గురువారం ఎస్సారెస్పీలోకి 6,150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 47.25 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువకు మూడు వేల క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు వంద క్యూసెక్కులు, లక్ష్మి కాలువకు 50 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



ఎస్సారెస్పీ ప్రాజెక్టు

యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్
మరో ఆరు నెలలు పొడిగింపు

జమ్మికుంట, ఆగస్టు 8: జమ్మికుంట రైల్వేస్టేషన్‌లో యశ్వంత్‌పూర్-గోరఖ్‌పూర్, గోరఖ్‌పూర్-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ గడువును మరో ఆరు నెలల పాటు పొడిగిస్తున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ శ్రీధర్ గురువారం ఒక ప్రకటన జారీ చేశారు. జమ్మికుంటలో జనవరి 29న యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్ మొదలైన విషయం తెలిసిందే. ప్రయోగాత్మకంగా ప్రారంభించిన హాల్టింగ్‌కు అనుకున్న విధంగా ప్రయాణికుల నుంచి స్పందన రాలేదు. దీంతో ఈ నెల 10వ తేదీ నుంచి హాల్టింగ్‌ను మరో ఆరు నెలల పాటు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

వారణాసిలో
వేములవాడ సత్రం ప్రారంభం

కరీంనగర్ టౌన్, ఆగస్టు 8: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వారణాసి (కాశీ) క్షేత్రంలో శ్రీరాజరాజేశ్వర క్షేత్ర ఆర్యవైశ్య వాసవి నిత్యాన్న సత్ర సంఘం వేములవాడ ఆధ్వర్యంలో వేములవాడ సత్రం ఏర్పాటు చేసింది. గురువారం వారణాసిలోని ఓ అద్దె భవనంలో సత్రం కమిటీ అధ్యక్షుడు, కరీంనగర్‌కు చెందిన వ్యాపారవేత్త బుస్సా శ్రీనివాస్ దంపతులచే పూజలు చేసి వేములవాడ సత్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ సత్రం ఉపాధ్యక్షుడు ఉప్పల రామేశం, బుస్సా దశరథంతో పాటు పలువురు దాతలు, సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుస్సా శ్రీనివాస్ మాట్లాడుతూ 18 డీలక్స్ రూమ్‌లతో ఉన్న అద్దె భవనంలో తాత్కాలికంగా వేములవాడ సత్రంను ప్రారంభించామని, శాశ్వత భవన నిర్మాణం కోసం ఇప్పటికే దాతలు ఇచ్చిన విరాళాలతో స్థలం కొనుగోలు చేశామని, శుక్రవారం భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తామని చెప్పారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి వారణాసి క్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం చక్కటి వసతితోపాటు తెలంగాణ రుచులతో కూడిన భోజనం కూడా కల్పించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బుస్సా శ్రీనివాస్ కోరారు.

ఇసుక డంప్ సీజ్

సుల్తానాబాద్, ఆగస్టు 8: మండలంలోని గర్రెపల్లి సమీపంలోగల ఓ వ్యవసాయ భూమిలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను సీజ్ చేసినట్లు తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి గురువారం తెలిపారు. డంప్ వద్ద ఉన్న దాదాపు ఇరవై ట్రాక్టర్ల ఇసుకను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అక్రమంగా ఇసుక తరలింపు కానీ, డంప్‌లు కానీ ఏర్పాటు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

బీఎస్సీ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఆగస్టు 8: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జూన్ 2024లో నిర్వహించిన బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్ రెండో సెమిస్టర్) పరీక్షల ఫలితాలను యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగ ప్రసాద్ గురువారం విడుదల చేశారు.

దోస్త్ స్పెషల్ ఫేజ్ సీట్ల కేటాయింపు పూర్తి

గణేశ్‌నగర్, ఆగస్టు 8: శాతవాహన విశ్వవిద్యాలయంలో దోస్త్ స్పెషల్ ఫేజ్ సీట్లలో ఉన్నత విద్యా మండలి శాతవాహన యూనివర్సిటీ పరిధిలో మొత్తం 3,157 సీట్లను కేటాయించిందని శాతవాహన యూనివర్సిటీ దోస్త్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత తెలిపారు. మొత్తం మూడు ఫేజ్‌లకు 15,950 సీట్లు కేటాయించగా 11,848 మంది విద్యార్థులు కళాశాలలో రిపోర్ట్ చేశారన్నారు. స్పెషల్ ఫేజ్‌లో 3157 సీట్లలో ప్రభుత్వ కళాశాలలో 440మంది విద్యార్థుల సీట్లు కేటాయించడం జరిగిందన్నారు. రెండు ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో 451మంది విద్యా ర్థులకు, ప్రైవేటు కళాశాలల్లో 2266 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించడం జరిగిందన్నారు. స్పెషల్ ఫేజ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు శుక్రవారం ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసి సీటు రిజర్వ్ చేసుకోవాలని లేనిపక్షంలో సీటు రద్దు అవుతుందని తెలిపారు.

అనారోగ్యంతో ఆత్మహత్య

జగిత్యాలరూరల్, ఆగస్టు 8: జగిత్యాల పట్టణంలోని సాయిరాంనగర్‌కు చెందిన రామస్వామి (54) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు టౌన్ ఎస్సై మన్సూర్‌ఖాన్ తెలిపారు. రామస్వామి కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మనస్థాపానికి గురై తన ఇంట్లో తాను నిద్రిస్తున్న మంచానికి నిప్పు అంటించుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మన్సూర్‌ఖాన్ తెలిపారు.

గౌరవెల్లి రిజర్వాయర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

చిగురుమామిడి, ఆగస్టు 8: గౌరవెల్లి రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని, హుస్నాబాద్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఉన్న ప్రజల సమస్యలను పరిష్కరించాలని గురువారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అధ్వర్యంలో కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను ఢిల్లీలో కలిసి విన్నవించారు. నేషనల్ హైవే రోడ్డు పనుల్లో కొంత మార్పులు చేయలని కోరినట్లు తెలిపారు. డివైడర్‌తో పాటు 4 వరుసల రోడ్డు వేయాలన్నారు. అంతకపేట నుండి కొత్తకొం డ వరకు నిర్మాణం చేయనున్న రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని అందుకు సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఎగువ ప్రాంతమైన కన్నారం, గండిపల్లి, కట్కూర్, కన్నా రం, ప్రాంతలకు సాగునీరు అందించేందుకు ఏర్పాట్లు జరిగేలా కృసి చేయలని కోరినట్లు తెలిపారు. తాము విన్నవించిన అనేక సమస్యలపై మంత్రి సానూ కులంగా స్పందించినారని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. మరిన్ని నిధులు మంజూరు చేసి అన్ని గ్రామాల్లో పూర్తిగా అబివృద్ధి పనులు జరిగేలా మంత్రి ప్రత్యేక కృషి చేస్తారని తెలిపారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట మండల బీజేపీ మండల అధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి, కుట్కూర్ గ్రామ మాజీ సర్పంచ్ జిల్లె అశోక్‌రెడ్డి, చందుపట్ల నాగరాజు, లతో పాటు తదితరులు ఉన్నారు.



కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో సమావేశమైన నాయకులు

భోజన్నపేటలో కుక్కల దాడి

● నలుగురికి గాయాలు

● నివారణ చర్యలు చేపట్టని అధికారులు

పెద్దపల్లి రూరల్ , ఆగస్టు 8 : పెద్దపల్లి మండలంలోని గ్రామాల్లో కుక్కల దాడి అధికమవుతోంది. మండలంలోని భోజన్నపేటలో గురువారం నలుగురు వ్యక్తులతో పాటు లేగదూడపై పిచ్చికుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. దీంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రులకు తరలించారు. ప్రతి రోజు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, మహిళలు దాడి చేసిన వైనాన్ని చూసి ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. అయినప్పటికీ గ్రామాల్లో కుక్కల బెడదను నివారించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఎల్లారెడ్డిపేటలో ఆరుగురు విద్యార్థులకు...

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 8: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం కుక్కలు దాడి చేసిన సంఘటనలో ఆరుగురు విద్యార్థులు తీవ్ర గాయాలపాలయ్యారు. గ్రామానికి చెందిన విద్యార్థులు మస్కూరి బ్రిటిష, మస్కూరి సహస్ర, ఏర్పుల వరుణ్, మద్దుల వర్షిత్ రెడ్డి, రాగుల రిత్విక, గుండం హనీష్ పాఠశాల నుంచి సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. ఆరుబయట హోంవర్క్ చేస్తున్న విద్యార్థులపై కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. తీవ్ర గాయాల పాలైన విద్యార్థులను మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. పలుమార్లు దాడి చేసి గాయపరిచినా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి కుక్కల బారి నుంచి తమకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

11న ఉమ్మడి జిల్లా
మహిళల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 8: ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఈ నెల 11న ఉమ్మడి జిల్లా మహిళల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డబ్బ్యా గణపతి తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభ చాటే మహిళా క్రీడాకారులను ఈనెల 16 నుంచి నిజామాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. 2008కి ముందు జన్మించిన క్రీడాకారులు ఆధార్ కార్డు జిరాక్సుతో జనన ధ్రువీకరణ పత్రంతో పాటు నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో జిల్లా ఉపాధ్యక్షుడు అంతటి శంకరయ్యకు రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్:9849114956 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక,ఆగస్టు8:మండలంలోని రెడ్డిపల్లిలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా కొర్కల్ గ్రామంలోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నా టాక్టర్‌ను పోలీసులు పట్టుకొని పోలీస్‌స్టేషన్ తరలించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ అంబాల రాజ్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో స్నేహితుడి హత్య

● డీఎస్పీ రఘుచందర్

కొడిమ్యాల, ఆగస్టు 8 : మద్యం మత్తులో స్నేహితుడినే హత్య చేసిన సంఘటనలో ఇద్దరు నిదితులను అరెస్ట్ చేసినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ వెల్లడించారు. గురువారం కొడిమ్యాల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు తెలిపారు. ఈ మేరకు పూడూర్ గ్రామానికి చెందిన మామిడి కమల్, మల్యాల మండలం గొర్రెగుండం గ్రామానికి చెందిన చిలువేరి తిరుపతి మృతుడు కందుల రాజశేఖర్‌తో మద్యం సేవించారు. మద్యం తాగుతున్న సమయంలో పాత గొడవల ప్రస్తావన వచ్చిందన్నారు. అదే సమయంలో రాజశేఖర్‌తో కమల్, తిరుపతి గొడవపడుతు కర్రతో తలపై కొట్టారన్నారు. రాజశేఖర్ అరుస్తుండగా నోటిలో ఇసుక పోసినట్లు డీఎస్పీ వివరించారు. హత్య చేసి సాక్ష్యాలను ధ్వంసం చేసేందుకు గాను మృతుడి స్కూటీ నుంచి పెట్రోలు తీసి కాల్చారన్నారు. నిందితులు ఇద్దరు కరీంనగర్ పారిపోతుండగా పూడూర్ గ్రామ శివారులో పట్టుకున్నట్లు తెలిపారు. ఇద్దరు నిందితుల వద్ద నుండి రక్తం మరకలు ఉన్న బట్టలు, సెల్, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాలుగు రోజులో హత్య కేసు చేదించిన మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్సై సందీప్, పోలీసులను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

రుణమాఫీకి కాంగ్రెస్ కొర్రీలు

● కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 8 : ఎన్నికల ముందు షరతులు లేకుండా రెండు లక్షలలోపు మూడు దఫాల్లో రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత అమలుకు సవాలక్ష ఆంక్షలు పెట్టి రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందని కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమాన్ని పార్టీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజుపాల్‌రెడ్డి నేతృత్వంలో గురువారం మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో నిర్వహించగా పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణ, కోడిపల్లి గోపాల్‌రెడ్డిలతో కలిసి ఆయన హాజరయ్యారు. రుణమాఫీ గురించి గ్రామాల్లోని రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 65లక్షల పాస్ బుక్‌లు ఉంటే ఎంత మందికి రుణమాఫీ చేస్తున్నారో తెలిపాలని, అదే విధంగా రైతు భరోసా రూ.15వేలు సంవత్సరంలోపు ఇస్తామన్న హామీ నేరవేర్చకుండా రైతు పసల్ బీమా యోజన, ధాన్యానికి క్వింటాలకు రూ. 500ల బోనస్ ఇవ్వడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు పార్టీ కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు మారు జనార్ధన్‌రెడ్డి, భోగ గంగాధర్, బోడ్ల రమేష్, వడ్డేపల్లి శ్రీనివాస్, సుఖేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై సిబ్బంది తక్షణమే స్పందించాలి

జగిత్యాల అర్బన్, ఆగస్టు 8: విద్యుత్ సమస్యలు ఉంటే సిబ్బంది తక్షణమే స్పందించాలని జిల్లా విద్యుత్ శాఖ ఎస్‌ఈ గంగాధర్ అధికారులు, సిబ్బందికి సూచించారు. జిల్లా కేంద్రంలో విద్యుత్ శాఖ డీఈలు, ఏడీలు, ఏఈలు, ఏఏఓలు, సబ్ ఇంజనీర్లు ఇతర విద్యుత్ అధికారులతో ఎస్ఈ గంగాధర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు ఉన్న ప్రతిచోట సిబ్బంది తక్షణమే స్పందించి యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. సిబ్బంది పనిచేస్తున్నపుడు అన్ని రక్షణ పరికరాలు వాడి, విద్యుత్ ప్రమాదాల భారిన పడకుండా రోజు ఉదయం సెక్షన్ ఆఫీస్ వద్ద పెప్‌టాక్ సమావేశంలో ప్రతిజ్ఞ చేయించాలని తెలిపారు. ప్రతినెల టార్గెట్ ప్రకారం విద్యుత్ బిల్లులు వసూలు చేసి వినియోగదారులకు కావలిసిన అభివృద్ధి పనులకు వినియోగించుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న అన్ని వ్యవసాయ సర్వీస్‌లకు కావల్సిన పోల్‌లు, ట్రాన్స్‌ఫార్మర్‌లు సామాగ్రి వెంటనే ఏర్పాటు చేసి సర్వీసులు రిలీజ్ చేయాలని ఆదేశించారు. సబ్‌స్టేషన్‌లు, లైన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్‌లు నిర్వహణ వివరాలను ఆన్‌లైన్ మొబైల్ ఆప్‌లో పొందుపర్చాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఎస్ఈ గంగాధర్

ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా జగిత్యాల వాసి



వెల్మల భరత్

జగిత్యాల, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా జగిత్యాల జిల్లా వాసి నియమితులయ్యారు. జగిత్యాల జిల్లా మేడిపెల్లి మండలం కట్లకుంట గ్రామానికి చెందిన వెల్మల భరత్ పదో తరగతి వరకు గ్రామంలోనే చదివారు. ఇంటర్, డిగ్రీ జగిత్యాలలోని ప్రభుత్వ కళాశాలలో చదివారు. 2015లో న్యాయవిద్యలో పట్టా అందుకొని అదే సంవత్సరం న్యాయవాదిగా హైకోర్టులో ప్రాక్టీసు మొదలుపెట్టాడు. గతంలో హైకోర్టు న్యాయవాదుల సంఘంలో కార్యనిర్వాహక సభ్యునిగా సేవలందించిన భరత్ ప్రస్తుతం హైకోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డికి, అడిషనల్ అడ్వకేట్ జనరల్ రజినీకాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. హైకోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా భరత్ నియామకం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

నాటుసారా తయారు చేస్తున్న ఇద్దరి అరెస్టు



ఇద్దరిని అరెస్టు చేసిన ఎక్సైజ్ సీఐలు

సుల్తానాబాద్, ఆగస్టు 8: నాటు సారాయితో పాటు, సారాయి తయారీ కోసం తీసుకువెలుతున్న ఇతర పదార్థాలను పట్టుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు సుల్తానాబాద్ ఎక్సైజ్ సీఐ రఘునాథ్ రాథోడ్ తెలిపారు. సుల్తానాబాద్ పట్టణంలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం ముందు గురువారం నిందితుల అరెస్టు చూపుతూ పదిహేను లీటర్ల సారాను, సారా తయారీ కోసం ఉపయోగించే వంద కిలోల బెల్లంను, పది కేజీల పటికను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ గురునాథ్ మాట్లాడుతూ వీణవంక మండలం నుంచి కాల్వశ్రీరాంపూర్ మండలం పందిళ్ల గ్రామానికి టాటా ఏసీ వాహనంలో గంట సారయ్య, బండి అఖిల్ అనే ఇద్దరు వ్యక్తులు వీటిని తరలిస్తుండగా తాము వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డారని వివరించారు. ఈ మేరకు సుల్తానాబాద్ ఎక్సైజ్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని అన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ కె ఎస్ ఎన్ రాజు, సిబ్బంది బీర్బల్, మహేందర్, సంతోష్ తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి



కందాల శ్రీనివాస్(ఫైల్)

ఇల్లందకుంట, ఆగస్టు 8: ఇల్లందకుంట మండల కేంద్రానికి చెందిన కందాల శ్రీనివాస్ (42) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ తన నివాసంలో సంపు హౌజ్‌లోని చిన్న మోటర్‌ను మరమ్మతు చేసేందుకు పైకి లాగి మోటర్‌ను అందుకునే సమయంలో ప్రమాదవశాత్తు మోటర్‌కు షార్ట్ సర్క్యూట్ కావడంతో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య నవత, ముగ్గురు పిల్లలున్నారు. మృతుడి భార్య నవత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

పొలంలో పడి వ్యక్తి మృతి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 8: మండలంలోని మూలసాల గ్రామానికి చెందిన నర్ర సమ్మయ్య (48) అనే రైతు ప్రమాదవశాత్తు పొలంలో పడి ఊపిరాడక మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం పొలానికి నీళ్ల పెట్టేందుకు వెళ్లి కాలు జారి పొలంలో పడిపోవడంతో మొహం పూర్తిగా బురదలో ఉండటంతో ఊపిరాడక మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 8: మండలంలోని అప్పన్నపేట గ్రామానికి చెందిన చింతపండు ఝాన్సీరాణి (19) అనే యువతి చికిత్స పొందుతూ మృతిచెందింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గత కొంతకాలంగా యువతి కడుపునొప్పితో బాధపడుతుండేది. నొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రిలో చేర్పించారు. అప్పటికీ వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి చింతపండు సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ స్వామి తెలిపారు.

బెదిరించిన వ్యక్తిపై కేసు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 8: చిట్టుమల్ల శ్రీనివాస్ అనే వ్యాపారవేత్తపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ, దూషిస్తూ చంపుతానని బెదిరింపులకు పాల్పడిన కరీంనగర్ వాసవీకాలనీకి చెందిన నీరుమల్ల శ్యాంసుందర్‌పై కేసు నమోదు చేశామని కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు తెలిపారు. కరీంనగర్‌కు చెందిన వ్యాపారవేత్త చిట్టుమల్ల శ్రీనివాస్‌కు పదేపదే ఫోన్ చేసి బూతులు తిడుతూ, చంపుతానని ఫోన్‌లో బెదిరించడంతో పాటు వాట్సప్ గ్రూపులలో అసభ్య పదజాలంతో దూషిస్తూ పోస్టులు పెట్టిన నీరుమల్ల శ్యాంసుందర్‌పై బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కోర్టు అనుమతితో నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గంభీరావుపేటలో వరుస దొంగతనాలు

గంభీరావుపేట, ఆగస్టు 8: గంభీరావుపేట మండల కేంద్రంలో వరుస దొంగతనాలతో ప్రజలు భయాందోళనతో ఉన్నారు. పక్షం రోజులుగా దొంగలు వరుస దొంగతనాలకు పాల్పడుతున్నారు. తాళాలు వేసిన ఇళ్లను దొంగలు టార్గెట్ చేస్తున్నారు. దీంతో ఇళ్లకు తాళాలు వేసి ఇతర గ్రామాలకు వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. ఏ రోజు ఏ ఇంట్లో దొంగతనం జరుగుతుందో.. తెల్లారితే ఏ ఇల్లు లూటీ అవుతుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. తాళాలు వేసిన పలు ఇళ్లల్లో ఇటీవల దొంగలు చోరీకి పాల్పడ్డారు. విజయ అనే మహిళ ఇంట్లో తప్ప మిగితా ఇళ్లలో పెద్దగా లూటి జరగలేదు. అయితే విజయ ఇంట్లో బంగారం, వెండి అభరణాలు దొంగలు ఎత్తుకెళ్లారు. విజయ ఇంటి ముందే కేజీటూపీజీకి సంబంధించిన సీసీ కెమెరాలు ఉన్నా.. సీసీ కెమెరాలు పనిచేయలేదని తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఓ కాలనీలో దొంగగా బావిస్తున్న ఓ వ్యక్తి చేతిలో ఇనుప సలాక పట్టుకుని ముసుగు ధరించి వెళుతున్న దృశ్యం అక్కడి సీసీ కెమెరాలో స్పష్టంగా కనిపిస్తోంది. ఆ సీసీ కెమెరా ఫుటేజీ సోషల్ మీడియా వైరల్ అవుతోంది. ఈ దృశ్యం గంభీరావుపేటలోనిదా కాదా ఇంకా స్పష్టం కాలేదు. దొంగలు గంభీరావుపేటలో రాత్రి సమయాల్లో సంచరిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. రెండు రోజుల క్రితం కూడ ఎల్లమ్మ కాలనీలో తాళం వేసి ఉన్న శివ అనే వ్యక్తి ఇంటి గోడ దూకారని పోలీస్‌లకు ప్రజలు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీస్‌లు అక్కడికి చేరుకునే సరికి దొంగలు మరో వైపు పరిగెత్తారని తెలిపారు. నిర్దారణతో పోలీస్‌లు, ప్రజలు కొద్ది దూరం వరకు వెళ్లి వెతికినా దొంగలు దొరకలేదు. ఏదీ ఏమైనా రాత్రి అయిందంటే గంభీరావుపేటలో దొంగల భయం వెంటాడుతోంది. పోలీసు అధికారులు రాత్రి సమయాల్లో మరింత గస్తీ పెంచి, దొంగల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరారు.

రైతులు సమష్టిగా
సొసైటీని అభివృద్ధి చేసుకోవాలి

● నాబార్డ్ డిడిఎం జయప్రకాశ్

చిగురుమామిడి,అగస్టు 8: రైతులు సమష్టిగా సొసైటీని అభివృద్ధి చేసుకోవాలని నాబార్డ్ డిడిఎం జయప్రకాశ్ అన్నారు. గురువారం మండలంలోని గాగిరెడ్డిపల్లి గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ గాగిరెడ్డిపల్లి సొసైటీకి ఎఫ్‌పీఓలో మంచి పేరు ఉందన్నారు. రానున్న రోజుల్లో సొసైటీని మరింత అభివృద్ధి చేసుకోవాలని రైతులకు సూచించారు. నాబార్డ్ నుంచి సహకారం ఉంటుందన్నారు. రైతులకు కావాల్సిన సదుపాయాలు అందిస్తామన్నారు. డాక్టర్ వేంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ రైతులు కంపోస్ట్ ఎరువులు వాడాలని అన్నారు. వరి పొలంలో ఎర్ర బొమ్మిడి రోగానికి జింకు వాడాలన్నారు.కార్యక్రమంలో సంఘం చైర్మన్ మంద శ్రీనివాస్, శాస్త్రవేత్తలు, రైతులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సమన్వయంతో వీధి కుక్కల సర్వే నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



అల్మాస్‌పూర్‌లో వివరాలను తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 8: పంచాయతీ, పశు సంవర్ధక శాఖ అధికారుల సమన్వయంతో వీధి కుక్కల సర్వేను నిర్వహించడంతో పాటు పట్టణ, పల్లె ప్రాంతాల్లో జంతు జనన నియంత్రణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ కార్యాలయంతో పాటు అల్మాస్‌పూర్ గ్రామాన్ని గురువారం ఆయన సందర్శించారు. 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లోని వార్డులను క్షేత్ర స్థాయిలో పర్యటించారు. పరిసరాలు, ప్రభుత్వ పాఠశాలల్లోని గదులను పరిశీలించారు. బడులు, మహిళా సంఘాల సమావేశాలు నిర్వహించి వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. అధికారులు ఇంటింటా జ్వర సర్వే నిర్వహించి ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని అన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్ట్రేషన్లు, ధరణి నమోదు వివరాలను పరిశీలించారు. ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచకూడదని, వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ రామచంద్రం, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

ఉపాధ్యాయ సంఘాల సభ్యత్వ నమోదు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 8: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్ల బొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, రాచర్లతిమ్మాపూర్, నారాయణపూర్, తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పీఆర్టీయూ, ఎస్టీయూ సంఘాల ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మండల విద్యాధికారుల పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘాల నాయకులు శ్రీనివాస్‌రావు, కృష్ణహరి, భగవాన్, బాబు, తిరుపతి, జయరాం, పూర్ణచందర్, తిరుపతి, సదానందం, గోపి, శ్రీనివాస్, ప్రశాంత్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలో గురువారం నిర్వహించిన టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంతరెడ్డి, మండల అధ్యక్షులు ఎల్లారెడ్డి, రమేష్, రాజేందర్, బాలరాజు, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలం కొలనూరులో పీఆర్‌టీయూటీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్ పాల్గొని మాట్లాడారు. అర్హులైన ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సంతోషకరమన్నారు. నాయకులు ఐరెడ్డి సాంబరెడ్డి, మహేష్, పులి రాజుగౌడ్, మధు, గంగాధర్, వెంకటేష్, శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌గౌడ్

సిరిసిల్ల రూరల్, అగస్టు 8: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని చదువులో ముందుకు సాగాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని బీసీ స్టడీసర్కిల్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ అధ్వర్యంలో జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక శిక్షణ తరగతులను గురువారం ఏర్పాటు చేశారు. ఈ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరైన టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలతో ముందుకు సాగాలన్నారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని కష్టపడి చదవాలని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అందుకోవాలన్నారు. జిల్లాస్థాయి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ తరగుతుల్లో జేవీవీ రాష్ట్ర నాయకులు రామరాజు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకటస్వామి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మూషం రమేష్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి నాగరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మంద అనిల్‌కుమార్, మల్లారపు ప్రశాంత్, ఉపాధ్యక్షుడు కుర్ర రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంక్‌లను శుభ్రపరుచుకోవాలి

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 8: సెప్టిక్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రపరుచుకోవాలని సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహత్ బేగ్ అలీ అన్నారు. గురువారం సిరిసిల్లలో మున్సిపల్ లైసెన్స్ కలిగిన సెప్టిక్ ట్యాంక్ శుభ్రపరిచే సర్వీస్ ప్రొవైడర్స్‌ను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఇంటి సెప్టిక్ ట్యాంకులను ప్రతీ మూడు సంవత్సరాలకు ఒకసారి, కమర్షియల్ కాంప్లెక్స్‌లోని సెప్టిక్ ట్యాంకులును ఏడాదికి ఒక్కసారి, పాఠశాలలు, కళాశాల లు, పబ్లిక్ ఇనిస్టిట్యూట్స్, సినిమా హాల్స్, పెట్రోల్ పంప్‌లు, పబ్లిక్ టాలెట్ యజమానులు ప్రతీ ఆరు నెలలకు ఒక్కసారి ట్యాంకులను శుభ్రపరుచుకో వాలని అన్నారు. ఇలా శుభ్రపరిచుకోవడం వల్ల భూగర్భ జలాలు, కలుషితం కావని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఈ ప్రసాద్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సూపర్‌వైజర్ ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

అడ్వకేట్ జనరల్‌ను కలిసిన న్యాయవాదులు



వినతి పత్రం అందిస్తున్న న్యాయవాదులు

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 8: కోర్టు ఉత్తర్వులను అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్న సిరిసిల్ల పోలీస్‌లపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని సిరిసిల్ల, వేములవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ హైకోర్టులో రాష్ట్ర అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డిని కలిసి న్యాయవాదులు విన్నవించారు. జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ పరిధిలో సివిల్ కేసుల్లో పోలీస్‌లు జోక్యం చేసుకోవడమే కాకుండా కోర్టు ఉత్తర్వులను అమలు చేయకుండా కక్షిదారులపై, న్యాయవాదులపై కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. వారం రోజులుగా సిరిసిల్ల, వేములవాడలో తాము కోర్టు విధులను బహిష్కరిస్తున్నప్పటికీ ఎలాంటి స్పందన లేదని అడ్వకేట్ జనరల్‌కు న్యాయవాదులు తెలిపారు. స్పందించిన అడ్వకేట్ జనరల్ న్యాయవాదులు ఎదురుకుంటున్న సమస్యలపై డీజీపీ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ పీపీ పల్ల నాగేశ్వర్‌రావు, హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, రాష్ట్ర న్యాయవాదుల ఫెడరేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ సునీల్ గౌడ్, బార్ కౌన్సిల్ సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, బుజంగరావు, తదితరులను కలిసి తమకు న్యాయయ చేయాలని న్యాయవాదులు కోరారు. కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం, కార్య దర్శి టి వెంకటి, మాక్స్ అధ్యక్షుడు గోవింద్ భాస్కర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

పల్లెలు పచ్చదనంతో కళకళలాడేలా చర్యలు







హరిదాస్‌నగర్‌లో వివరాలు తెలుసుకుంటున్న డీపీవో వీరబుచ్చయ్య, చందుర్తి పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుభ్రం చేస్తున్న పోలీసులు, పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఇల్లంతకుంట ఎస్సై

- డీపీవో వీరబుచ్చయ్య

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 8: పల్లెలు స్వచ్ఛత, పచ్చదనంతో కళకళలాడేలా చర్యలు తీసుకుంటున్నామని డీపీవో వీరబుచ్చయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్, రాచర్లబొప్పాపూర్ గ్రామాల్లో జిల్లా వైద్యాధికారి వసంతరావుతో కలిసి గురువారం ఆయన పర్యటించారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోని పలు వార్డుల్లో ఇంటింటా తిరుగుతూ పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. పంచాయతీ, వైద్య సిబ్బంది సంయుక్తంగా గ్రామాల్లో నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలు రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనం, తరగతి గదులను పరిశీలించారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్తయ్య, ఎంపీవో రాజు, వైద్యాధికారులు స్రవంతి, చిరంజీవి, గ్రామ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కోనరావుపేట: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి, ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. కోనరావుపేట మండలం మామిడిపల్లిలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాల పనులను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. గ్రామంలో క్లోరినేషన్ చేయాలని సిబ్బందికి సూచించారు. ఫీవర్ సర్వేలను ప్రతిరోజు చేయాలని అన్నారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ ప్రకాష్‌రావు, మండల వైద్యాధికారి వేణుమాధవ్, డాక్టర్ అఖిల్, జీపీ కార్యదర్శి సతీష్, హెచ్‌ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: పరిశుభ్రతతోనే ఆరోగ్యానికి మేలు జరుగుతుందని మండల వైద్యాధికారిని డాక్టర్ గీతాంజలి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులు పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జ్యోతి, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరి చేరవని మండల ప్రత్యేక అధికారి, ఆర్డీవో రమేష్ అన్నారు. గురువారం స్వచ్ఛతనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్త్ క్యాంప్‌ను ఆర్డీవో రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చాన్నారు. మురికినీటి నిల్వలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, డాక్టర్ స్నేహ, ఎంపీవో మీర్జా అఫ్జల్ అహ్మద్, కార్యదర్శి రఘువీర, మనోహర్‌రెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

● పరిసరాల పరిశుభ్రత పాటించాలి..

చందుర్తి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చందుర్తి పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం చెత్తాచెదారం తొలగించి, మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. పరిసరాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: పచ్చదనాన్ని పెంచి ప్రతీ ఒక్కరు పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ పేర్కొన్నారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: స్వచ్ఛధనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణను ఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది శుభ్రం చేశారు. పాత వస్తువులు, అవసరంలేని వస్తువులను తొలగించడంతోపాటు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ చంద్రమౌళి, హెడ్‌కానిస్టేబుల్ మల్లేశం, కానిస్టేబుల్‌లు సంపత్, రాజేంద్రప్రసాద్, శ్రీకాంత్, ఫారుక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్సీ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలి



సిరిసిల్లలో వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 8: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎస్సీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా పట్టణ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం నిరసనలు తెలిపి తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బీజేపీ ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షుడు తుమ్మ విజయ్ మాట్లాడుతూ ఎస్సీ డిక్లరేషన్ ప్రకారం అంబేద్కర్ అభయహస్తం కింద ప్రతీ కుటుంబానికి రూ. 12 లక్షల ఆర్థిక సహాయం అందజేయాలన్నారు. ఎస్సీ ఉపకులాలు, మాల, మాదిగ కార్పొరేషన్‌కు సంవత్సరానికి ర. 750 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఇనుగంటి నరేష్, బీజేపీ యువమోర్చా పట్టణ అధ్యక్షుడు వంగ అనిల్ కుమార్, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు పండుగ మాధవి, ఓబీసీ పట్టణ అధ్యక్షుడు అంకారపు రాజు, పట్టణ కార్యదర్శి సుంకోజు రమేష్ పాల్గొన్నారు.

కోనరావుపేట: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ మండల అధ్యక్షుడు గొట్టే రామచంద్రం అన్నారు. మండల కేంద్రంలో తహసీల్దార్‌కు పలు సమస్యలపై గురువారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. నాయకులు కొమిరెడ్డి గంగాధర్, జింక వెంకటి, మోత్కు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు మహిపాల్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు నిరసన చేపట్టి ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతిరెడ్డికి వినతిపత్రం అందించారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి తిరుపతి, నాయకులు లింబాద్రి, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామపంచాయితీ కార్మికులు

సిరిసిల్ల కలెక్టరేట్, అగస్టు 8: గ్రామపంచాయతీల్లో అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న కార్మికుల సమస్యలతోపాటు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే నిరవధిక సమ్మెలోకి వెళ్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ ప్రకటించారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ గ్రామపంచాయతీ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ అధ్వర్యంలో గురువారం జిల్లాలో అన్ని గ్రామాల నుంచి వచ్చిన గ్రామపంచాయతీ కార్మికులతో కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి ధర్నా చేయడంతోపాటు అక్కడే నిరహార దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం అమ లు చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. గ్రామాలను పచ్చదనం పరిశ్రభంగా ఉంచడం కోసం ప్రజల ఆరోగ్యాలను సైతం లెక్కచేయకుండా అహర్నిశలు కష్టపడి పనిచేస్తున్నారన్నారు. గ్రామపంచాయితీ కార్మికులు, సిబ్బంది సమస్యలపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ప్రస్తుత ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం, అధికారులు వివిధ కార్యక్రమాల పేరుతో గ్రామపంచాయతీ కార్మికులతో పనిచేయించుకోవడంపై ఉన్న శ్రద్ధవారి సమస్యలను పరిష్కరించడంపై ఎందుకు ఉండడం లేదని ప్రశ్నించారు. గ్రామపంచాయితీ కార్మికుల సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వం పరిష్కారించాలని లేకుంటే నిరవధిక సమ్మెకు వెళ్తామని అన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయితీ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్యాల నర్సయ, అన్నల్‌దాస్ గణేష్, జిల్లా కమిటీ సభ్యులు బుర్ర శ్రీనివాస్, వర్కోలు మల్లయ్య, నారాపురం నర్సయ్య, అంజయ్య, లక్ష్మణ్, శ్రీనివాస్, గంగరాజు, శేఖర్, అనిల్ , మహేష్, వెంకటేష్, రవి పాల్గొన్నారు.

స్వార్థ ప్రయోజనాల కోసమే బీఆర్ఎస్ నాయకుల రాజకీయం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 8: ప్రజల సమస్యలను పక్కన పెట్టి తమ స్వార్థ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ నాయకులు రాజకీయం చేయడం సరైంది కాదని కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమం ముసుగులో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో ప్రజలకు ఏం చేసిందో చెప్పాలని అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు తమ ఓటుతో తీర్పు ఇచ్చినా ఆ పార్టీ నాయకుల తీరు మారలేదని అన్నారు. నాయకులు రాజునాయక్, రాజేందర్, బాబు, రాంరెడ్డి, లచ్చిరెడ్డి, దేవయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల టౌన్: పది సంవత్సరాల పాలనలో మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పద్మశాలీలను ఆదుకుంటే సిరిసిల్లలో రోడ్లపై దీక్షలు, ధర్నాలు, రాస్తారోకో నిరసనలు ఎందుకు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ ఉపాధ్యక్షుడు అన్నల్ దాస్ భాను ప్రశ్నించారు. గురువారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా సాధన వల్లే సిరిసిల్ల అభివృద్ధి జరిగిందని జిల్లా సాధనలో నాడు కేకే మహేందర్‌రెడ్డి కీలక పాత్ర పోషించారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వంగ మల్లేశంగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య వెంటనే క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొంగు తిరుపతి యాదవ్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు హరిలాల్ నాయక్, పలువరు నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిగత విమర్శలకు దిగితే ఊరుకోం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 8: ప్రతిపక్ష పార్టీగా ప్రజల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కాంగ్రెస్ నాయకులు వ్యక్తిగత విమర్శలకు దిగితే చూస్తూ ఊరుకోబోమని బీఆర్ఎస్ నాయకుడు అందె సుభాష్ హెచ్చరించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జడ్పీటీసీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి మాట నిలుపుకోవాలని అన్నారు. ప్రతి హామీని నెరవేర్చే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో నాయకులు నర్సింహారెడ్డి, దేవరెడ్డి, శ్రీనివాస్, సందీప్, వెంకటనర్సింహారెడ్డి, రాజం, నర్సింలు, హసన్, సీత్యా నాయక్, లక్ష్మణ్, గౌస్ పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: కాంగ్రెస్ నేతలు మతిభ్రమించి మాట్లాడుతున్నరని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మాట్ల మధు ఎద్దేవా చేశారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో నాయకులు కొయ్యడ రమేష్, అబ్బడి అనిల్‌రెడ్డి, చిలివేరి చిరంజీవి, గుండు ప్రేమ్ కుమార్, అమర్‌రావ్, అఫ్రోజ్ ఉన్నారు.

డిపో ఆదాయం పెంచడానికి కృషి: డీఎం

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 8: టీజీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనర్ ఆదేశాల మేరకు సిరిసిల్ల డిపో ఆదాయం పెంచడానికి కృషి చేస్తున్నామని సిరిసిల్ల ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రకాశ్‌రావు అన్నారు. గురువారం సిరిసిల్ల డిపో కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

శ్రావణమాసంను పురస్కరిం చుకొని ఆర్టీసీ ఎండీ సజ్జనర్ ఇచ్చిన లక్ష్యాన్ని సాధించడానికి ప్రయత్నిస్తామన్నారు. వరంగల్ సెక్టార్‌లో దాదాపు 45 శాతం సిరిసిల్ల డిపో బస్సు సర్వీసులు నడుస్తున్నాయని అన్నారు. డిపో ప్రతిరోజు ఆదాయం టికెట్లపై దాదాపు రూ. 17లక్షల వరకు, కార్గో ద్వారా ప్రతిరోజు దాదాపు రూ. 10వేల ఆదాయం వస్తుందన్నారు. ఈనెల 14 నుంచి శుభముహూర్తాలు మొదలవుతున్నాయన్నారు. ప్రజలకు శుభకార్యాలకు 10 శాతం డిస్కౌంట్‌తో అతి తక్కువ ధరలో బస్సులను అద్దెకు ఇవ్వడానికి ఎండీ అనుమతులు ఇచ్చారని అన్నారు. ఈ అవకాశాన్ని సిరిసిల్ల డిపో పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

రాష్ట్ర స్థాయి జావెలిన్ త్రోలో తిరుపతికి సిల్వర్ మెడల్

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 8: హైదరాబాద్ సరూర్‌నగర్‌లో తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు పురుషుల విభాగం జావెలిన్ త్రోలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన యువకుడు కపీరపు తిరుపతి సిల్వర్ మెడల్ సాధించాడు. గురువారం సిరిసిల్ల పట్టణంలో రాష్ట్ర స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించిన తిరుపతిని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిక్కాల రామారావు, ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్, కార్యదర్శి అంజయ్‌కుమార్, కోశాధికారి భూక్య వినోద్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి కనకము శ్రీనివాస్, నేరెళ్ల గంగాధర్ అభినందించారు.

విద్యార్థులకు భగవద్గీత, హనుమాన్ చాలీసా అందజేత

తంగళ్లపల్లి, ఆగస్టు 8: స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మండేపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మాజీ ప్రజాప్రతినిధులు భగవద్గీత, హనుమాన్ చాలీసా అందజేశారు. కార్యక్రమంలో మండేపల్లి మాజీ సర్పంచ్ గణప శివ జ్యోతి, మాజీ ఎంపీటసీ బుస్స స్వప్న లింగం, మాజీ ఉపసర్పంచ్ ధర్మారెడ్డి రాములు, అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు ధర్మారెడ్డి హారిక, మాజీ చైర్మన్ నక్క నరేష్, మాజీ వార్డు మెంబర్ శేఖర్, రఘు, అమరగొండ రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సాంస్కృతిక వైభవానికి ప్రతీక 'తీజ్'



తీజ్ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి ఆగస్టు 8: గిరిజలనుల సాంస్కృతిక వైభవానికి ప్రతీక తీజ్ వేడుకలు అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం దేవుని తండా జలపతి తండాలో జరిగిన తీజ్ వేడుకల్లో గురువారం రాత్రి ఆయన పాల్గొన్నారు. శ్రావణ మాసంలో గిరిజన మహిళలు అంతా కలిసి ఘనంగా నిర్వహించుకునే తీజ్ పండుగ గిరిజన సాంస్కృతిక వైభవానికి ప్రతీక అని ఆది శ్రీనివాస్ తెలిపారు. ఉత్సవాల్లో మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, నాయకులు భీమరాజు కనకరాజు, మ్యాకల గణేష్, ముకుంద రెడ్డి, గిరిజన నాయకులు భీమా నాయక్ సోమలా ల్ నాయక్ పంతులు నాయక్ శ్రీనివాస్ నాయక్ బాలు నాయక్ తిరుపతి నాయక్ రామోజీ నాయక్ శత్రులాల్ నాయక్ పూజారి బికియా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

● తల్లిపాలు బిడ్డలకు శ్రేష్ఠమైనవి

చందుర్తి: తల్లిపాలే పుట్టిన బిడ్డలకు రక్ష అని, వ్యాధినిరోధక శక్తి పెరగాలంటే తల్లిపాలే శ్రేష్ఠమని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారికి అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, సీడీపీవో సౌందర్య, అడిషనల్ సీడీపీవో సుచరిత, అంగన్వాడి సూపర్వైజర్లు, టీచర్లు, తల్లులు, బాలింతలు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులు కార్యకర్తలు

వేములవాడ రూరల్: కార్యకర్తలు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఫాజుల్నగర్ గ్రామంలోని సుమారు 200 మంది ముదిరాజ్, రజక, కుర్మా, రెడ్డి సంఘ సభ్యులు, హన్మాజీపేట గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు గురువారం ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వేములవాడ రూరల్: మండలంలోని జయవరం గ్రామానికి చెందిన నాగరాజు, కిరణ్ కుమార్, శ్రీనివాస్ గత సంవత్సరం బైండోవర్ అయ్యారు. బైండోవర్ తర్వాత భూమి తగాదాల కారణంగా వారిపై కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో వారికి రూరల్ తహసీల్దార్ సుజాత బుధవారం నిర్దేశిత జరిమానా విధించారని రూరల్ ఎస్సై మారుతి తెలిపారు.

చందుర్తి: మండలంలోని ఆశిరెడ్డిపల్లిలోని ఎంపీయుపిఎస్ పాఠశాలలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు నటించిన వృక్ష విలాపం అనే వీడియోను గురువారం ప్రధానోపాధ్యాయురాలు రజిత, ఉపాధ్యాయులు ఆవిష్కరించారు.

కోనరావుపేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ వంగ మహేందర్‌రెడ్డి రూ. 20 వేల విలువ గల మైక్ సెట్‌ను పాఠశాల హెచ్‌ఎం రాజేశంనకు అందజేశారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని సింగారంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ సర్పంచ్ చాకలి రజిత భర్త రాములు కుటుంబానికి స్థానికుడు ధర్మాగౌడ్ రూ.2 వేల నగదు, 25 కిలోల బియ్యం వితరణ చేశారు.

- ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్, బొప్పాపూర్ గ్రామాల్లోని లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును నాయకులు అందజేశారు.

- ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వృద్ధుల డేర్ సెంటర్‌లోని వృద్ధులు సిరిసిల్లలోని సినిమా టాకీస్‌లో కల్కి సినిమాను తిలకించారని కేంద్రం కో-ఆర్డినేటర్ మమత తెలిపారు.

- ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్లగుండారం ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సింగపూర్ దేశానికి చెందిన బౌద్ధ మత ప్రచారకులు గురువారం విద్యా సామగ్రిని అందజేశారు. మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిరిసిల్ల టౌన్: జిల్లా కేంద్రంలో గోపాలమిత్ర జిల్లా యూనియన్ సమావేశం జరిగింది. జిల్లా యూనియన్ కార్యవర్గంను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు ఎం భాస్కర్, ప్రధాన కార్యదర్శి బానోతు ప్రవీన్‌నాయక్, ఉపాధ్యక్షుడు ఎం శ్రీనివాస్, కార్యదర్శి రాంజన్, ప్రచార కార్యదర్శి సంతోష్, సభ్యులుగా దినేష్, చిన్నోజి, అజయ్, సతీష్‌ను ఎన్నుకున్నారు.

తంగళ్లపల్లి: వేతనాల కోసం ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు నల్లా బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని మండేపల్లి ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు జూన్, జూలై వేతనాలు అందలేదన్నారు. వెంటనే బదిలీలు చేపట్టాలని, 010 పద్దు ద్వారా వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

గంభీరావుపేట: మండలంలోని నాగంపేట బంజార తండాకు చెందిన కమల కుటుంబానికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కును కాంగ్రెస్ నాయకులు అందజేశారు.

సిరిసిల్ల రూరల్: పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో రాజశ్యామల, వారాహి సహిత, లలిత త్రిపుర సుందరి, అష్టలక్ష్మీ సహిత లక్ష్మీనారాయణ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా కుంకుమార్చన నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, మహిళా కౌన్సిలర్లు గడ్డం లత, దార్నం అరుణ, తదితరులు పాల్గొన్నారు. వేడుకలు అయ్యప్ప దేవాల యం ట్రస్ట్ చైర్మన్ గురుస్వామి రాచ విద్యాసాగర్ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి.